# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**
2. **శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సోమశిల..కండలేరు జలాశయాలను మరింత పటిష్టం చేస్తామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
3. **రాష్ట్రంలో 36మంది ఐపీఎస్ అధికారులు, ఒక నాన్ క్యాడర్ పోలీస్ సూపరింటెండెంట్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. వారిలో 28 మందికి పోస్టింగులు ఇచ్చింది.**
4. **ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు 19.54 శాతం వృద్ధితో 5 లక్షల 74 వేల కోట్ల రూపాయలకు పైగా చేరాయి.**
5. **సామాన్య భక్తులకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు నిరీక్షణ సమయాన్ని తగ్గించామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు తెలిపారు.**

=========================

ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని తన కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిర్మాణ రంగాన్ని వేగవంతం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. గోదావరి జలాలను కృష్ణా జలాలతో అనుసంధానం చేయడం వల్ల ప్రస్తుతం పంటలకు కావలసిన సాగునీరును అందించే దిశగా చర్యలు చేపట్టామని రవీంద్ర వివరిస్తూ..

..వాయిస్...30 సెకన్లు....

-------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సోమశిల..కండలేరు జలాశయాలను మరింత పటిష్టం చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు తెలిపారు. ఈ రోజు ఆయన మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ...ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి సోమశిల జలాశయాన్ని సందర్శించారు. వరదల వల్ల దెబ్బతిన్న అప్రాన్‌ను మంత్రులు పరిశీలించారు. దీనికి చేపట్టవలసిన మరమ్మతులను మంత్రులకు ఇంజినీర్లు

వివరించారు. కాగా.. మంత్రి హోదాలో తొలిసారి జిల్లాకు వచ్చిన రామానాయుడును మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దగ్గుమాటి కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్ నెల్లూరులోని రహదారుల భవనాలశాఖ అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

---------------------------

రాష్ట్రంలో 36మంది ఐపీఎస్ అధికారులు, ఒక నాన్ క్యాడర్ పోలీస్ సూపరింటెండెంట్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. 23 జిల్లాల ఎస్పీలకు స్థానచలనం కలిగించి ఆ స్థానాల్లో కొత్త అధికారులను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నిన్న ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ చేసిన వారిలో 28 మందికి ప్రభుత్వం పోస్టింగులు ఇచ్చింది. మిగిలిన 9 మందిని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

---------------------------

ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా అధికారులను ఆదేశించారు. విపత్తు ఎదురైనప్పుడు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటూ, ఆస్తి, ప్రాణనష్టాన్ని వీలైనంత తగ్గించాలని సూచించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ.. ఏపీఎస్‌డీఎంఏ కార్యాలయాన్ని నిన్న ఆయన సందర్శించారు. విపత్తుల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడంలో దేశంలోనే రాష్ట్రం ముందుండటంపై హర్షం వ్యక్తంచేశారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంలో సంస్థ వినియోగిస్తున్న సాంకేతికతల గురించి సిసోడియాకు అధికారులు వివరించారు.

---------------------------

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు 19.54 శాతం వృద్ధితో 5 లక్షల 74 వేల కోట్ల రూపాయలకు పైగా చేరాయి. కార్పొరేట్ల ముందస్తు పన్ను చెల్లింపులు అధికంగా నమోదుకావడం ఇందుకు దోహదం చేసింది. జూన్ 15వ తేదీతో ముగిసే తొలి విడత ముందస్తు పన్ను చెల్లింపులు 27.34 శాతం పెరిగి లక్షా 48 వేల కోట్ల రూపాయలకు చేరాయి. ఇందులో కార్పొరేట్ ఆదాయ పన్ను..సీఐటీ లక్షా 14 వేల కోట్ల రూపాయలు ఉండగా.. వ్యక్తిగత ఆదాయ పన్ను..పీఐటీ 34 వేల 470 కోట్ల రూపాయలుగా ఉంది. ఈ నెల 11వ తేదీ నాటికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 5 లక్షల 74 వేల 357 కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి.

---------------------------

నిజాయితీకి, నిర్భీతికి నిలిచి “మాకొద్దీ తెల్లదొరతనం” పాటతో స్వాతంత్ర్యోద్యమ సత్యాగ్రహుల్లో తెగువను, ఉత్తేజాన్ని రగిలించిన ప్రముఖ కవి, రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ళ సత్యనారాయణ జయంతి ఈరోజు. దేశభక్తి కవితలు రాసి, జైలు శిక్ష అనుభవించిన వారిలో గరిమెళ్ళ ప్రథమ స్థానంలో ఉంటారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలూకా గొనేపాడు గ్రామంలో జన్మించిన ఆయన తెలుగునాట జాతీయ కవిత్వానికి ఒరవడి దిద్దిన ప్రముఖులుగా కీర్తి గడించారు. “స్వరాజ్య గీతములు” అన్న పేరుతో రాసిన పుస్తకం ఆయనకు మంచి పేరు తీసుకువచ్చింది. ఆంగ్ల భాషలో కూడా కొన్ని రచనలు చేశారు. ఖండ కావ్యాలు, భక్తి గీతాలు, బాల గీతాలు మొదలైన రచనలు చేసిన గరిమెళ్ళ సత్యనారాయణ 1952 డిసెంబర్ 18వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

న్యాయవిద్యార్థుల భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుందని, వారికి అపార అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో నూతనంగా చేరిన విద్యార్థులకు 'న్యాయవిద్యపై' నిన్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జస్టిస్ మన్మథరావు పాల్గొని మాట్లాడారు. మీడియేషన్, ఆర్బిట్రేషన్, మారిటైం, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, వివిధ కార్పొరేట్ సంస్థల ద్వారా విద్యార్థులకు అనేక అవకాశాలు లభిస్తున్నాయని వివరించారు. దేశంలో నిపుణులైన న్యాయవాదుల అవసరం ఎంతో ఉందని తెలిపారు.

---------------------------

సామాన్య భక్తులకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు నిరీక్షణ సమయాన్ని తగ్గించామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు తెలిపారు. ఇందుకోసం స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ల జారీ పెంచామని వెల్లడించారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సామాన్య భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన వివరించారు. లడ్డూ ప్రసాద నాణ్యతను పెంచామని.. చిన్న పిల్లలకు పాలు అందిస్తున్నామని, ఆహార కేంద్రాలను పెంచామని వెల్లడించారు. తిరుమల విషయంలో ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, దానికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు.

---------------------------

ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో పలు చోట్ల భారీవర్షాలు కురుస్తున్నాయి. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో అత్యధికంగా 154 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉమ్మడి గుంటూరు, నెల్లూరు, తిరుపతి, తూర్పుగోదావరి, బాపట్ల జిల్లాల్లోనూ భారీవర్షాలు కురిశాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు సాధారణం కంటే 38.3 శాతం అధిక వర్షపాతం నమోదైంది. మొత్తం 11 జిల్లాల్లో అత్యధికంగా వానలు కురిశాయి. రాయలసీమ జిల్లాల్లోనూ వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంది. సాధారణం కంటే చిత్తూరు జిల్లాలో 96.6 శాతం అధికంగా నమోదైంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీవర్షాలతో కోస్తాలో పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కాగా.. మరో రెండు రోజుల పాటు కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు, రాయలసీమలో ఒక మోస్తరు వానలు కురిసే అవకాశం ఉందని.. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని పలువురు ప్రముఖులు ఈరోజు దర్శించుకున్నారు. సుప్రభాత సేవలో రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ ద్వారకా తిరుమలరావు పాల్గొన్నారు. అనంతరం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కూడా వీఐపీ విరామ సమయంలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కాగా.. తిరుమలలో నిన్న రాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షం పడుతుండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుమల ఘాట్ రోడ్లలో ప్రయాణించే వాహనదారులకు తిరుమల తిరుపతి దేవస్థానం పలు సూచనలు చేసింది. వాహనాలను నెమ్మదిగా నడపాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

=====================